క్లుప్తంగా

విద్యుత్ సరఫరాలో అంతరాయం

హుడాకాంప్లెక్స్: మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా బుధవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సరూర్‌నగర్ డివిజనల్ ఇంజినీర్ రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ జైన్‌మందిర్, చైతన్యపురి, హనుమాన్‌నగర్, గంగా హాస్పిటల్, ఫణిగిరికాలనీ, ఫ్రూట్ మార్కెట్, దుర్గానగర్, శివాలయం, గణేష్‌పురికాలనీ, పెద్దఅంబర్‌పేట టౌన్, ఇందిరానగర్, మన్సూరాబాద్ ఫీడర్ల పరిధిలోని కాలనీలలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్‌ను నిలిపివేస్తున్నారు. 11కేవీ రాక్‌టౌన్‌కాలనీ, జీఎస్ఐ, చాణక్యపురి, వాంబేకాలనీ, హనుమాన్‌నగర్, మోహన్‌నగర్, లక్ష్మారెడ్డిపాలెం ఫీడర్ల పరిధిలో మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 వరకు విద్యుత్‌ను నిలిపివేయనున్నారు.

కరెంట్ సమస్యల పరిష్కారానికి గ్రీవెన్స్

హుడాకాంప్లెక్స్: విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం బుధవారం హయత్‌నగర్‌లోని అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్ కార్యాలయం(ఆటోనగర్) వద్ద వినియోగదారుల గ్రీవెన్స్ నిర్వహించనున్నట్లు డీఈ రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి సీజీఆర్‌ఎఫ్ చైర్‌పర్సన్, మెంబర్ టెక్నికల్, మెంబర్ ఫైనాన్స్, కన్స్యూమర్ అఫైర్లు హాజరవుతారని వినియోగదారులు దీర్ఘకాలంగా ఉన్న విద్యుత్ సమస్యలు, బిల్లుల్లో హెచ్చుతగ్గులపై ఫిర్యాదు చేసి పరిష్కారం పొందగలరని సూచించారు. ఉదయం 10.30 గంటలకు మధ్యాహ్నం 1 గంటల వరకు సమావేశం నిర్వహించనున్నారు.

గురుకులంలో ఇంటర్ ప్రవేశాలు

బడంగ్‌పేట్: బడంగ్‌పేట కార్పొరేషన్ పరిధిలోని గుర్రంగూడలో మైనార్టీ గురుకుల బాలుర కళాశాలలో 2023–24 సంవత్సరానికి గాను మొదటి సంవత్సరం సీఈసీ, హెచ్‌ఈసీ గ్రూపుల్లో ప్రవేశాలకు అడ్మిషన్లు జరుగుతున్నాయని ప్రిన్సిపాల్ దిలీప్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రస్తుతం పదవ తరగతి చదువుతున్న విద్యార్థులు ఈ నెల 18 నుంచి ఫిబ్రవరి 6వ తేదీ వరకు కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అన్ని పోటీ పరీక్షలకు ఇక్కడ కోచింగ్ ఉంటుందని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు ఫోన్ నెం. 9440092745, 9948365100లను సంప్రదించవచ్చు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



మాట్లాడుతున్న తహసీల్దార్ మహమూద్ అలీ

మహేశ్వరం: మండల కేంద్రంలో ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా ముందస్తుగా విద్యార్థులకు వ్యాసరచన, రంగోలి పోటీలను మంగళవారం నిర్వహించారు. గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. వ్యాసరచన పోటీల్లో ప్రథమ బహుమతి ఎ.అఖిల్ (మహేశ్వరం బాలుర ఉన్నత పాఠశాల), ద్వితీయ బహుమతి అక్షరలక్ష్మి (మోడల్ స్కూల్ మహేశ్వరం), తృతీయ బహుమతి చిన్నారి (మహేశ్వరం బాలికల ఉన్నత పాఠశాల), ప్రత్యేక బహుమతి ఎ.సౌమ్య (తుక్కుగూడ ఉన్నత పాఠశాల) విద్యార్థులు గెలుపొందారు. విజేతలకు మహేశ్వరం తహసీల్దార్ మహమూద్ అలీ బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ కృష్ణ, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ధనుంజయ్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఇన్‌చార్జి మంత్రిని కలిసిన మేయర్



మంత్రి శ్రీధర్‌బాబుకు పుష్పగుచ్ఛం ఇస్తున్న మేయర్ పారిజాతారెడ్డి

బడంగ్‌పేట్: రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబును మంగళవారం బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ చిగురింత పారిజాతారెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రికి పూలబొకే ఇచ్చి శాలువతో సన్మానించారు. కార్యక్రమంలో నగర పంచాయతీ మాజీ వైస్‌చైర్మన్ నర్సింహారెడ్డి, కార్పొరేటర్‌లు ప్రభాకర్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, నాయకులు బాబు, జైహింద్, గోవర్ధన్‌రెడ్డి, గిరి ముదిరాజ్ తదితరులున్నారు.

ఆదమరిస్తే ప్రమాదమే!



మూత లేని నాలా

నాలాలపై లేని మూతలు

- అదుపు తప్పితే అంతే..
- పట్టించుకోని అధికారులు

బడంగ్‌పేట్: అకాల వర్షాలతో వచ్చే వరదల నుంచి కాలనీలను రక్షించడానికి నాలాలను అధికారులు నిర్మించారు. కానీ దానిపై పటిష్టమైన మూతలు ఏర్పాటు చేయడంలో విఫలమయ్యారు. కాంట్రాక్టర్లు అసంపూర్తిగా వదిలేయడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బడంగ్‌పేట్, అల్మాస్‌గూడ, నాదర్‌గుల్ తదితర ప్రాంతాల్లో వెలిసిన వందలాది కాలనీల నుంచి వచ్చే డ్రైనేజీ మురుగు, వరద నీరు నాలాల గుండా వెళ్లేలా రూపొందించారు. ఆ నీరంతా మీర్‌పేట కార్పొరేషన్ పరిధిలోని పెద్ద చెరువులోకి వెళుతోంది. మూడేళ్ల క్రితం ఊహించని భారీ వరదలు రావడంతో కాలనీలు నీళ్లల్లోనే మునిగిపోయాయి. ఇలా ప్రతి ఏడాది జరగడం పరిపాటిగా మారింది. ప్రభుత్వం శాశ్వత పరిష్కారమే మార్గమని ఎస్ఎన్‌డీపీ నాలాను కాలనీల మీదుగా తీసుకువచ్చింది. బడంగ్‌పేట్ పరిధిలోని పెద్ద చెరువుకు కొత్తగా వేసిన కట్టకు పక్కన నాలాను నిర్మించారు. దాని గుండా వచ్చిన డ్రైనేజీ, వరదనీరు పెద్ద చెరువులోకి వెళ్లకుండా అక్కడి నుంచి నేరుగా మూసీకి వేళ్లేలా ప్రణాళికలు రూపొందించి పనులు పూర్తి చేశారు. అంతా బాగానే ఉన్నా అధికారుల నిర్లక్ష్యం కారణంగా నాలాపై మూతలు వేయడం మరిచారు. 15 ఫీట్ల లోతులో ఉన్న నాలా కింద 5 ఫీట్ల డయాను మూసీకి అనుసంధానం చేశారు. రోజూ వరద నీటి ప్రవాహం ఎక్కువగా వస్తోంది. ప్రమాదవశాత్తు ఎవరైనా అందులో పడితే మూడున్నర కిలోమీటర్ల దూరంలో ఉన్న మందమల్లమ్మ చౌరస్తా దగ్గర చంద్రా గార్డెన్ వద్ద వెతకాల్సిందే. లేదంటే సరూర్‌నగర్ చెరువు అక్కడి నుంచి మూసీకి చేరుతారు.

మందుబాబులకు అడ్డాగా..

పెద్ద చెరువు పక్కన నాలుగు మ్యాన్ హోళ్లను నిర్మించి మూతలు బిగించకుండా వదిలివేశారు. అక్కడ ఉన్న సిమెంట్ దిమ్మెలు మందుబాబులకు అడ్డాగా మారింది. నిత్యం అక్కడే మద్యం తాగుతున్నారు. రాత్రి సమయంలో కొత్తగా వేసిన చెరువు కట్టకు నాలుగు ఫీట్ల లోతులో ఉన్న నాలా మరో ప్రమాదంగా మారింది. ప్రమాదకర నాలాలు ఎవరికీ కనిపించకుండా ఉన్నాయి. ఏదైనా జరగరానిది జరిగితే పూర్తి బాధ్యత అధికారులే వహించాల్సి ఉంటుందని కాలనీవాసులు వాపోతున్నారు. కమీషన్లకు కక్కుర్తి పడి సగం పనులు చేసి ప్రమాదకరంగా వదిలివేశారు. కనీసం చుట్టూ ముళ్ల కంచె కూడా వేయకపోవడం గమనార్హం. హెచ్‌ఎండీఏ, మున్సిపల్ అధికారులు ఇకనైనా నిద్రమత్తు వీడి నాలాలపై మూతలు ఏర్పాటు చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

అమ్మ జ్ఞాపకార్థం.. శాశ్వత సేవలు

- ఉదారత చాటుకుంటున్న మాజీ సర్పంచ్ రామిడి రాంరెడ్డి
- తిరుమలనగర్ ఫేజ్- 3లో సొంత నిధులతో కమ్యూనిటీ హాల్ నిర్మాణం
- అల్మాస్‌గూడలో ఇప్పటి వరకు పది భవనాలు కట్టించిన నాయకుడు

బడంగ్‌పేట్: అల్మాస్‌గూడకు చెందిన మాజీ సర్పంచ్, బీఆర్ఎస్ బడంగ్‌పేట కార్పొరేషన్ అధ్యక్షుడు రామిడి రాంరెడ్డి తన మాతృమూర్తి రామిడి కళావతి వర్ధంతి సందర్భంగా శాశ్వత సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. తిరుమలనగర్ ఫేస్- 3లో కాలనీవాసుల కోసం తన సొంత నిధులతో కమ్యూనిటీ హాల్‌ను నిర్మించారు. మంగళవారం భవనాన్ని స్థానికులకు అప్పగించారు. అల్మాస్‌గూడలో ఇప్పటి వరకు సుమారు 10కి పైగా కాలనీల్లో తన సొంత డబ్బులు వెచ్చించి కమ్యూనిటీ హాళ్లు కట్టించారు. అల్మాస్‌గూడలోని వైకుంఠధామంలో బోర్లు, స్నానపు గదులు, షెడ్ల నిర్మాణం చేపట్టారు. చదువుల్లో రాణిస్తున్న పేదింటి పిల్లలను గుర్తించి ఆర్థిక భరోసా, చేయూత అందిస్తున్నారు. ఈ కార్యక్రమంలో రామిడి ప్రతాప్‌రెడ్డి, కార్పొరేటర్ రామిడి కవిత, కుటుంబ సభ్యులు, కాలనీ అధ్యక్షుడు పుల్లారెడ్డి, పలు కాలనీల సంక్షేమ సంఘం ప్రతినిధులు, మహిళలు పాల్గొన్నారు.



మాతృమూర్తి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రాంరెడ్డి, కుటుంబ సభ్యులు

బాల్య వివాహాలు అరికట్టేందుకు కృషి



కార్యక్రమంలో పాల్గొన్న ఇన్‌చార్జి ఎంపీపీ సునితానాయక్

నాగుల్‌దోని తండాల్లో నేషనల్ గర్ల్ చైల్డ్ డే

మహేశ్వరం: బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మండల ఇన్‌చార్జి ఎంపీపీ కె.సునితానాయక్ పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని నాగుల్‌దోని తండాల్లో ఐసీడీఎస్ మహేశ్వరం ప్రాజెక్టు ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రంలో నేషనల్ గర్ల్ చైల్డ్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆడ పిల్లలను చదివించి ప్రయోజకులను చేయాలని కోరారు. ఆడ పిల్లలకు 18 సంవత్సరాలు నిండిన తర్వాతనే వివాహం చేయాలన్నారు. బాల్య వివాహాలను ప్రోత్సహించిన వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందన్నారు. ముందుగా ఆడ పిల్లల చదువు, అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలు, తల్లులు, గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలకు అందిస్తున్న పౌష్టికాహారం, పాలు, గుడ్లు, బాలమృతం గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీఓ షభానా, సర్పంచ్ రాజునాయక్, బీఆర్ఎస్ నాయకులు అంధ్యానాయక్, సూపర్‌వైజర్స్ విద్యావతి, శిరీష, దివ్య, అనిత, లక్ష్మీ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

జల్‌పల్లిలో పారిశుద్ధ్యంపై ప్రత్యేక డ్రైవ్

- రద్దు చేసిన నిధులను తిరిగి ఇవ్వాలి
- వేసవిలో నీటి ఎద్దడికి చర్యలు
- పెండింగ్ పనులను పూర్తి చేస్తాం
- మున్సిపాలిటీ సమీక్షలో ఎమ్మెల్యే సబితారెడ్డి

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీ కార్యాలయంలో ఎమ్మెల్యే సబితారెడ్డి మంగళవారం సాధారణ సమీక్ష నిర్వహించారు. చైర్మన్ అబ్దుల్లా సాది అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మున్సిపల్, విద్యుత్, జలమండలి అధికారులు, పాలక మండలి సభ్యులతో పారిశుద్ధ్యం, తాగునీరు, వీధిదీపాలు, పెండింగ్ పనులపై చర్చించారు. ఈ సందర్భంగా వార్డుల వారీగా కౌన్సిలర్లు స్థానికంగా నెలకొన్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ఎక్కడ పడితే అక్కడ చెత్త కుప్పలు కుప్పలుగా దర్శనమిస్తుండడం. ప్రధాన రహదారులపై మురుగునీరు పారుతుండడం, నీటి కనెక్షన్లు ఇవ్వకున్న బిల్లులు వస్తున్నాయని కౌన్సిలర్లు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ముఖ్యంగా పారిశుద్ధ్య సమస్య పరిష్కారానికి అవసరమైన మేర కొత్త సిబ్బందిని నియమించడం, కొత్తగా స్వీపింగ్ మిషన్లు కొనుగోలు చేయాల్సిన అవసరం ఉందని తెలియజేశారు. అనంతరం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజాపాలనలో సిబ్బంది తలమునకలు కావడంతో 15–20 రోజుల నుంచి మున్సిపాలిటీలో పారిశుద్ధ్యం పడకేసి ప్రజలు అసౌకర్యానికి గురవుతున్నారన్నారు. ఇందుకోసం వారం రోజుల పాటు ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని నిర్ణయించామన్నారు. ప్రణాళికబద్ధంగా అధికారులకు బాధ్యతలు అప్పగిస్తున్నామన్నారు. మున్సిపాలిటీలో నెలకొన్న డంపింగ్ యార్డ్ సమస్యను కూడా పరిష్కరిస్తామన్నారు. గతంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ జల్‌పల్లికి రూ.45 కోట్లు ఇచ్చారన్నారు. ఎన్నికలకు ముందు మొదలుపెట్టిన రోడ్లు, డ్రైనేజీ పైప్‌లైన్ పనుల్లో కొన్ని పూర్తవ్వగా.. మరికొన్ని తుదిదశకు చేరుకున్నాయని, వాటిని వెంటనే పూర్తి చేస్తామన్నారు. హరితహారం సందర్భంగా నియోజకవర్గానికి విచ్చేసిన కేసీఆర్ ఎస్‌డీఎఫ్ కింద రూ.25 కోట్లు ఇస్తే.. కొత్త ప్రభుత్వం రద్దు చేసిందని ఆమె గుర్తు చేశారు. జల్‌పల్లిలో పేద, మధ్య తరగతి ప్రజలే నివాసం ఉంటున్నారని, వారి అవసరాలను గుర్తించి ఆ నిధులను విడుదల చేయాలని ముఖ్యమంత్రిని కోరుతున్నానని పేర్కొన్నారు. మొత్తం మహేశ్వరం నియోజకవర్గంలో రూ.175 కోట్ల ఎస్‌డీఎఫ్ నిధులను డ్రైన్స్, రోడ్లకే పెట్టామన్నారు. కానీ, వీటిని రద్దు చేయడం తగదన్నారు. ఇక మున్సిపాలిటీలోని కాలనీల్లో కొత్తగా తాగునీటి పైప్‌లైన్లు వేశామని, కనెక్షన్ ఇవ్వాల్సి ఉందని చెప్పారు. రాబోయే వేసవిని దృష్టిలో ఉంచుకొని బోర్లకు కూడా మరమ్మతులు చేయాలని సూచించామన్నారు. కార్యక్రమంలో కమిషనర్ వసంత, వైస్ చైర్మన్ ఫర్హానా నాజ్, కోఆప్షన్ మెంబర్ సూరెడ్డి కృష్ణారెడ్డి, కౌన్సిలర్లు బుడుమాల యాదగిరి, పల్లపు శంకర్, లక్ష్మీనారాయణ, భాషమ్మ, జాఫర్ బామ్, సవూద్ అవల్గీ, శంషాద్దీన్, మజ్హర్ అలీ, ఖాలేద్ మహరూస్, డీఈ వెంకన్న, ఏఈ నుస్రత్ ఆయేషా, జలమండలి సెక్షన్ మేనేజర్ సాజిద్ అలీ, పహాడీషరీఫ్ ఏఈ సత్యనారాయణ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

ఆర్డీఓకు వినతి పత్రం అందజేసిన మధ్యాహ్న భోజన కార్మికులు

కందుకూరు: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన కార్మికులు మంగళవారం ఆర్డీఓ సూరజ్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కన్వీనర్ బుట్టి బాల్‌రాజ్ మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకు నాలుగు నెలలుగా మధ్యాహ్న భోజన బిల్లులు, వారి వేతనాలు మంజూరు చేయలేదన్నారు. బహిరంగ మార్కెట్‌లో ఉన్న విధంగా గుడ్ల ధరలు ఇవ్వడంలేదని వాపోయారు. దీంతో కార్మికులకు ఒక్కొక్కరికి నెలకు రూ.2 వేల నుంచి రూ.3 వేల వరకు అదనంగా భారం పడుతుందన్నారు. ప్రతి నెల 5వ తేదీ లోపు బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు. గ్యాస్, వంట పాత్రలు, తాగునీటి సౌకర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మిక సంఘం అధ్యక్షురాలు ప్రభావతి, కార్యదర్శి కిషన్, అశ్విని, శైలజ, జంగమ్మ, అండాలు, రజని, కలమ్మ పాల్గొన్నారు.



ఆర్డీఓకు వినతి పత్రం అందిస్తున్న నాయకులు

సైబర్ నేరగాళ్లతో జాగ్రత్త

ఎస్ఐ వెంకటనారాయణ

యాచారం: సైబర్ క్రైమ్ నేరాలపై పాఠశాల స్థాయిలోనే విద్యార్థులు అవగాహన, చైతన్యం కలిగి ఉండాలని యాచారం ఎస్ఐ వెంకటనారాయణ సూచించారు. మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో వివిధ పాఠశాలల విద్యార్థులకు మంగళవారం సైబర్ క్రైమ్ నేరాలపై ఆయన అవగాహన కల్పించారు. ఓటీపీలు ఎవరికీ చెప్పవద్దని అన్నారు. ఏ ఇబ్బందులున్నా యాచారం పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు.

అప్రమత్తంగా ఉండాలి

ఇబ్రహీంపట్నం రూరల్: సైబర్ నేరాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని ఆదిబట్ల ఎస్ఐ రాజు పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని బొంగ్లూర్‌లో గల ఆదర్శ పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు సైబర్ మోసాల పట్ల ఆయన అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ఎస్ఐ రాజు మాట్లాడుతూ.. రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులున్నా పోలీసులను సంప్రదించాలన్నారు. ఆన్‌లైన్ మోసాలకు గురికావొద్దని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ శ్రీనివాస్, సైబర్ క్రైం టీం, విద్యార్థులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ వెంకటనారాయణ

నిధులను సద్వినియోగం చేసుకోవాలి

ఎంపీపీ కొప్పు సుకన్య

యాచారం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా పంచాయతీలకు మంజూరవుతున్న నిధులను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ కొప్పు సుకన్య పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం బ్లాక్ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక (బీపీడీపీ) సమావేశం జరిగింది. ఈ సమావేశానికి వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు. ఎంపీపీ మాట్లాడుతూ... నిధుల ఖర్చు, నిధుల జమ విషయంలో ప్రణాళికలు ఉంటేనే నిధులు దుర్వినియోగం కాకుండా ఉంటాయని అన్నారు. వైస్ ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీడీఓ విజయలక్ష్మి, తహసీల్దార్ శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సుకన్య

భూపేశ్‌గుప్తానగర్‌లో భారీ శోభాయాత్ర

హస్తినాపురం: అయోధ్యలో బాల రాముడి ప్రాణప్రతిష్ట జరిగిన సందర్భంగా హస్తినాపురం భూపేష్‌గుప్తానగర్ కాలనీలో మంగళవారం భారీ శోభాయాత్ర నిర్వహించారు. కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, కర్మన్‌ఘాట్ హనుమాన్ ఆలయ ధర్మకర్త నారగోని శ్రీనివాస్‌యాదవ్ ఆధ్వర్యంలో నల్ల పోచమ్మ ఆలయం నుంచి ఆంజనేయస్వామి ఆలయం వరకు సీతారామచంద్ర, లక్ష్మణ, ఆంజనేయ స్వామి ఉత్సవమూర్తులను భజనలతో ఆటపాటలతో శోభాయాత్ర నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో యాత్రలో పాల్గొన్నారు. ఆలయ ప్రధాన అర్చకుడు దండే వినయ్ శాస్త్రి, అయ్యప్ప స్వామి సన్నిధానం వెంకటగిరిగౌడ్ గురుస్వామి, కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు కాలేరు దేవేందర్, ఎరుకల చిన్న మల్లేశ్‌గౌడ్, బబ్బూరి శారద ప్రభాకర్‌గౌడ్, విజయలక్ష్మి, సంతోషి పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/ వనస్థలిపురం రైతుబజార్లలో కూరగాయల ధరలు... (కిలో... రూపాయల్లో) టమాటా 21, వంకాయ 18, బెండ 35, పచ్చిమిర్చి 50, కాకర 40, బీర 45, క్యాబేజ 19, ఫ్రెంచిబీన్స్ 45, క్యారెట్ 23, దొండ 21–23, చిక్కుడు 23–28, గోకర 53, బీట్‌రూట్ 15, క్యాప్సికం 50, ఆలు 18–23, దోస 25, సొర 9, పొట్ల 13, ఉల్లిగడ్డ 22, చామగడ్డ 65.

విద్యావేత్త షరీఫ్‌కు జీవిత సాఫల్య పురస్కారం



దుబాయ్‌లో అవార్డు అందుకుంటున్న షరీఫ్

వనస్థలిపురం: ప్రముఖ విద్యావేత్త, కృష్ణవేణి టాలెంట్ స్కూల్స్, రెయిన్‌బో స్కూల్స్ చైర్మన్ ఎంఎం షరీఫ్ 'జీవిత సాఫల్య పురస్కారం' అందుకున్నారు. విద్యారంగాభివృద్ధికి మూడు దశాబ్దాలుగా ఆయన చేస్తున్న కృషి గుర్తింపుగా జనవరి 20న దుబాయ్‌లో జరిగిన మిడిల్ ఈస్ట్ ఏషి యా లీడర్‌షిప్ అవార్డుల ప్రదానోత్సవంలో ఈ పురస్కారాన్ని అందజేశారు. షరీఫ్‌కు అ వార్డు రావడంపై విద్యారంగ ప్రముఖులు, ఉ పాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు హ ర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు అభినందనలు తెలిపారు.

ఉన్నత లక్ష్యంతో ముందుకుసాగాలి

ఐక్యతా ఫౌండేషన్ సభ్యుడు శ్రీరాములు

ఆమనగల్లు: విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగాలని ఐక్యతా ఫౌండేషన్ సభ్యుడు, మాజీ సర్పంచ్ రచ్చ శ్రీరాములు పిలుపునిచ్చారు. ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులను కార్పొరేట్ పాఠశాలల విద్యార్థులకు దీటుగా తీర్చిదిద్దడమే ఐక్యతా ఫౌండేషన్ లక్ష్యమని ఆయన చెప్పారు. ఆమనగల్లు పట్టణంలోని ప్రభుత్వ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలు, ఆకుతోటపల్లిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఐక్యతా ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి సహకారంతో అందించిన 'స్కాన్ అండ్ లెర్న్' పుస్తకాలను మంగళవారం ఆయన పంపిణీ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లోని పదవ తరగతి విద్యార్థుల కోసం ఐక్యతా ఫౌండేషన్ స్కాన్ అండ్ లెర్న్ డిజిటల్ కంటెంట్ పుస్తకాలను రూపొందించడం జరిగిందని చెప్పారు. పాఠ్య పుస్తకాల్లో ఉన్న పాఠాలను విభజించి ఒక్కో పాఠానికి క్యూ ఆర్ కోడ్ రూపొందించి ఆ పాఠం యొక్క సారాంశం, క్యూ ఆర్ కోడ్‌ను స్కాన్ చేయడం ద్వారా వీడియోల రూపంలో విద్యార్థులకు అందుతుందని ఆయన వివరించారు. కల్వకుర్తి నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందిస్తామని శ్రీరాములు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు తిరుపతయ్య, మల్లయ్య, మల్లేశ్‌నాయక్, తిరుపతి, కొండల్‌రెడ్డి, శివ, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.



స్టడీ మెటీరియల్ అందుకున్న విద్యార్థులతో ఫౌండేషన్ సభ్యులు

అజయ్‌పై చర్యలు తీసుకోవాలి

మాదిగ సంఘాల ఐక్యవేదిక

తలకొండపల్లి: భారత రాజ్యాంగ నిర్మాత డా.బీఆర్.అంబేడ్కర్, జాతిపిత మహాత్మాగాంధీని తీవ్ర పదజాలంతో దూషించి అవమానించిన నల్లగొండ జిల్లా గట్టుప్పల మండలం తేరెటిపల్లికి చెందిన అజయ్‌పై చర్యలు తీసుకోవాలని మాదిగ సంఘాల ఐక్యవేదిక నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు తలకొండపల్లి పోలీస్ స్టేషన్‌లో అజయ్‌పై మంగళవారం ఫిర్యాదు చేశారు. అజయ్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. దన్నారం బాలు, బలరాం, విటాపల్లి రమేష్, మీసాల రమేష్, శెట్టిపల్లి రామకృష్ణ పాల్గొన్నారు.

ఓబీసీ జాబితాలో చేర్చండి

ఇబ్రహీంపట్నం: కేంద్ర ఓబీసీ జాబితాలో వీరశైవ లింగబలిజ లింగాయత్‌లను చేర్చాలని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శెట్టి శివకుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన ఇబ్రహీంపట్నంలో మాట్లాడుతూ.. ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా వెనుకబడిన లింగబలిజలను కేంద్ర ప్రభుత్వం గుర్తించి ఓబీసీ జాబితాలో చేర్చేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ఈ విషయమై ఇటీవల రాష్ట్రపతి, కేంద్ర మంత్రులకు వినతిపత్రాలను అందజేశామన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లోపు దీనిపై కేంద్ర ప్రభుత్వం నిర్ణయాన్ని తీసుకోవాలని కోరారు.

రేపు ట్రాక్టర్ల ర్యాలీ

ఆమనగల్లు: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రైతు, కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తోందని తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి ఆరోపించారు. ఆమనగల్లు పట్టణంలో మంగళవారం మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా గురువారం ఆమనగల్లు పట్టణంలో ట్రాక్టర్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ శక్తులకు ధారాదత్తం చేసే కుట్రలు సాగుతున్నాయని ఆరోపించారు.

బహిరంగ ప్రకటన

నా క్లయింట్ ఎం.ఎస్.జాయింట్ హొరిజోన్ LLP, ప్రాతినిధ్యం వహించినవారు నియమించబడిన భాగస్వామి శ్రేయన్ భటేవరా రంగారెడ్డి జిల్లా, మహేశ్వరం మండలం, అమీర్‌పేట్ గ్రామం వద్ద గల ఎ.0-15 గుంటల విస్తీర్ణంతో సర్వే నం. 106 కలిగి ఉత్తరం: అమీర్‌పేట్ నుండి మహేశ్వరం వరకు మెయిన్ రోడ్, దక్షిణం: ప్రసాద్‌రాజు మరియు ఇతరులకు చెందిన భూమి, తూర్పు: ప్రసాద్‌రాజు మరియు ఇతరులకు చెందిన భూమి, పశ్చిమం: యజమానుల మిగతా భూమి హద్దులుగా గల ప్లాట్‌ను కొనుగోలు చేయుటకు 20-11-2023 తేదీ గల అమ్మకం ఒప్పందం కుదుర్చుకుని శ్రీమతి తుమ్మల శారదా దేవి భర్త తుమ్మల చంద్రశేఖర్‌కు పాక్షిక అమ్మకం మొత్తాలను చెల్లించారని సాధారణ ప్రజలకు ఇందుమూలముగా తెలియచేస్తున్నారు.

ఎవరేని వ్యక్తి/లు లేదా ఏదేని ఆర్థిక సంస్థ/లు, బ్యాంకులు, సంస్థ లేదా కంపెనీ/లు పైన తెలిపిన సదరు ఆస్తికి సంబంధించి పాక్షికంగా లేదా పూర్తిగా ప్రతిపాదిత అమ్మకం లావాదేవీకి ఏదేని హక్కు, టైటిల్, క్లెయిమ్, లీన్, ప్రయోజనం/లు లేదా అభ్యంతరాలు కలిగి ఉన్నట్లయితే, అట్టి వారి క్లెయిమ్‌కు మద్దతుగా డాక్యుమెంట్లతో సహా తమ వ్రాతపూర్వక అభ్యంతరాలను దిగువ సంతకందారుకు ఈ నోటీసు ప్రచురణ తేదీ నుండి 10 రోజుల లోగా పంపవలెను.

ఒకవేళ అభ్యంతరాలు అందనట్లయితే, నా క్లయింట్ మిగిలిన అమ్మకం ప్రతిఫలాన్ని చెల్లించి అమ్మకం లావాదేవీని పూర్తిచేయుటకు ముందుకు కొనసాగుతారు మరియు సదరు ఆస్తి యొక్క నమోదిత సేల్ డీడ్ మరియు స్వాధీనతను పొందుతారు. అభ్యంతరాలు ఏవైనా ఉంటే, ఆ తరువాత అవి అంగీకరించబడవు మరియు చెల్లనివిగా, కొట్టివేయబడినవిగా పరిగణించబడును.

సం/- కె. ధరమ్ సింగ్, అడ్వకేట్
బి1, బి బ్లాక్, దుర్గా ఎంక్లేవ్, ఆర్.కె.నగర్
అత్తాపూర్, హైదరాబాద్ - 500048
మొబైల్: 9030581001
ఇ-మెయిల్: priveattorney@gmail.com